విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

భూముల విలువ పెంపుతో సామాన్యులకు చిక్కులే...

మార్కెట్ విలువ పెంపుపై కొరవడిన క్లారిటీ సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో తప్పని ఇక్కట్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భూముల విలువ పెంపు పేరుతో భారీగా మార్కెట్ విలువ పెంచడంతో సామాన్యులు చితికి పోతున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా చలానా కట్టేందుకు అల్లాడిపోతున్నామని అనేకమంది సామాన్య మధ్యతరగతి ప్రజలు సబ్ రిజిస్టర్ కార్యాలయల వద్ద వాపోతున్నారు. మరోపక్క పెంచిన మార్కెట్ విలువ ధరలను ఆన్లైన్లో క్లారిటీగా పెట్టకపోవడంపై డాక్యుమెంట్ రైటర్లు, క్రయవిక్రయదారులు, సబ్ రిజిస్టార్ కార్యాలయం అధికారులు తీవ్ర గందర గోళానికి గురవుతున్నారు. విశాఖలో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరిగే సూపర్ బజార్ వద్ద ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయంలో గందరగోళంగా మారింది. ప్రభుత్వం ప్రస్తుతం పెంచిన ధరలు రియల్ ఎస్టేట్ రంగానికి దోహదపడ తాయని, నల్లధనాన్ని తెల్లదనంగా మార్చుకునేందుకు భూముల విలువలను అత్యధికంగా పెంచారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. విశాఖ నగరంలో రేసపువానిపాలెం పరిధిలో ఉన్న భూములు విలువ గజం రూ.48,000 నుంచి రూ.98,000కు పెంపుదల చేయడం తో సామాన్య ప్రజలు కొనుగోలుకు అల్లాడిపోతున్నారు. క్రయవిక్రయదారులు మధ్య గజం స్థలం రూ.60 వేలు నుంచి రూ.70 వేలు మధ్య కొనుగోలు జరుగుతున్నప్పటికీ రిజిస్ట్రేషన్ చార్జీ మాత్రం అత్యధికంగా చెల్లించాల్సి వస్తుందని అనేకమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక విశాఖ నగరంలో ఏ మూల చూసినా 30,000 నుంచి 50 వేలు ఒక్కసారిగా ధరలను పెంచారు. అపార్ట్మెంట్లో ఎస్ఎఫ్టి ధర అత్యధికంగా రూ.9 వేలు నిర్ణయించడంతో చిరు ఉద్యోగులు నివాసం కోసం కొనుగోలు చేసే అపార్ట్మెంట్‌లకు అత్యధికంగా రిజిస్ట్రేషన్ చార్జీ చెల్లించాల్సి వస్తుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ముడుపులు యధాతథంగానే సాగుతున్నాయి. అన్ని చార్జీలు తడిసి మోపిడై క్రయవిక్రయదారులపై గంపెడుభారం అవుతుందని అనేకమంది ప్రభుత్వ వైఖరిని నిరసిస్తున్నారు. నిత్యం సర్వర్లో చిక్కులు తలెత్తడంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రోజంతా నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

11న బీజేపీ విద్రోహ పాలనపై నిరసన ర్యాలీ: వామపక్షాలు

విశాలాంధ్ర - విశాఖ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తొమ్మిదేళ్ళ విద్రోహ పాలనపై ఈనెల 11న జరిగే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని వామపక్ష పార్టీలు ప్రజలకు విజ్ఞప్తి చేసాయి. మద్దిలపాలెం సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 9 ఏళ్ళ పాలనలో రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు, విశాఖపట్నానికి తీవ్ర ద్రోహం చేసిందన్నారు. విశాఖ మణిహారం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని దుయ్యబట్టారు. పోర్టు, రక్షణ రంగం, రైల్వే, విద్యుత్, ఆయిల్ పరిశ్రమలు, బ్యాంకులు, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరిస్తోందని విమర్శించారు. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పెనుభారాలు మోపిందని విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 28 కార్మిక చట్టాలను 4లేబర్‌కోడ్లుగా మార్చి కార్మికులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసి విశాఖలో ఈ నెల 11న విజయోత్సవ సభలకు పూనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. విజయోత్సవ సభ కంటే దీనిని విద్రోహ సభ అంటే సరిపోతుందని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విశాఖ సభలో పాల్గొనే ముందు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ రైల్వే జోన్ అమలు చేస్తామని ప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల రక్షణకు, బిజెపి తొమ్మిదేళ్ళ విద్రోహ పాలనపై ఈ నెల 11న ఉదయం 10 గంటలకు రైల్వే డి.ఆర్.ఎం ఆఫీస్ నుండి ఆర్టీసి కాంప్లెక్స్ వరకు నిరసన ర్యాలీ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణను పరిశీలించిన సీపీఐ

రెవిన్యూ తీరుపై ఆగ్రహం అనర్హులకు ఎల్‌పీసీ మంజూరుపై అభ్యంతరం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై విశాలాంధ్రలో ఈనెల 3న వచ్చిన సత్యనారాయణ పురంలో అమ్మకానికి ప్రభుత్వ భూమి కథనంపై సీపీఐ పార్టీ స్పందించింది. సదరు ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు ఆధ్వర్యంలో బృందం శుక్రవారం పరిశీలించింది. అనంతరం సచివాలయానికి చేరుకొని వీఆర్‌ఓతో సదరు ఆక్రమణపై చర్చించారు. ఆర్ఐ రమేష్‌తో ఫోన్లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల అండతో రెవెన్యూ అధికారుల ఆగడాలు రోజురోజుకు పెచ్చు మీరిపోతున్నాయని ఆరోపించారు.

లక్షల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా, అధికార పార్టీకి చెందిన పంచాయతీ పెద్దలు ప్రభుత్వ భూమిని అమ్మకానికి పెట్టి అమ్మేసుకుంటున్నా, వాటిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లో పుట్టుకొస్తున్నా చర్యలు తీసుకోకపోవడం రెవిన్యూ రహస్య ఒప్పందానికి నిదర్శనం అని అన్నారు. నిరుపేదల ఎల్‌పీసీ పేరుతో అనర్హులకు, పంట పొలాలు, సొంత ఇల్లు ఉన్న ధనికులకు ఎల్పీసీలు మంజూరు చేసి లక్షలు వసూలు చేస్తున్నారనే ఆరోపణ ఉన్నాయని అన్నారు.

రెవెన్యూ అధికారులకు, పంచాయతీ పెద్దలకు మధ్య కుదిరిన రహస్య ఒప్పందంతో సత్యనారాయణపురంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురై, ఆపై అక్రమ పద్ధతిలో అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. అనర్హులకు ఇచ్చిన ఎల్‌పీసీని తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించి, భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మూలపేట ఇరుగుల కాలనీలో తొమ్మిది సెంట్లు ప్రభుత్వ భూమిని చదును చేసి ఆక్రమించుకోవడానికి స్కెచ్ వేసిన ఈశ్వరరావు అనే వ్యక్తిపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ నాయకులు నరాల శెట్టి సత్యనారాయణ, వీయ్యపు రాజు, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఏపీఆర్ఎస్ ఎంట్రన్స్ విజేత ఉనైసా

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల గ్రామానికి చెందిన దేవరపల్లి ఉనైస ఏపీ ఆర్ఎస్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో విజేతగా నిలిచింది. ఈ ఫలితాల్లో మాడుగుల వీనస్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ నుంచి దేవరపల్లి ఉనైస ఏపీ ఆర్ఎస్ భీమిలిలో ఎంపికైంది. తల్లిదండ్రులు దేవరపల్లి రామకృష్ణ (మాడుగుల జూనియర్ కాలేజ్ హిందీ ఫ్యాకల్టీ) తల్లి దేవరపల్లి రూపలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎంపికైన ఆ పాఠశాలలో సీబీఎస్సీ సిలబస్‌తో ఉన్న ఉన్నతమైన విద్యతో పాటుగా ఉచితంగా వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తారన్నారు. ఆమెకు వీనస్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్ తాలపురెడ్డి నాగ చంద్ర శిక్షణ ఇచ్చారని వారు పేర్కొన్నారు.

శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డు అడివివరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎన్వి నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఎస్.ఆర్ పురం ప్రియదర్శిని బధిరుల పాఠశాల ఉపాధ్యాయిని మట్టా వాసవి పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కెఎస్ఆర్ మూర్తి, రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షులు బి.బి.రాజేంద్ర ప్రసాద్, టిపికె వర్మ, భానుమూర్తి, యల్లమ్మ, రమేష్, బి.మోహన్, వర, పుష్ప తదితరులు పాల్గొన్నారు. అనంతరం కీ.శే.బయ్యవరపు నర్సింగరావు మాష్టారు జ్ఞాపకార్థం విద్యార్థులకు బిస్కట్లు పంపిణీ చేశారు.

పుస్తకాలు జీవితాన్ని ప్రభావితం చేస్తాయి

విశాలాంధ్ర - మల్కాపురం: మనిషి జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలలో పుస్తకాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని ప్రముఖ కార్మిక నాయకులు బి.సత్యానందం అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న చిన్నారుల వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ పుస్తకాలు గొప్ప మార్పును మనలో తెస్తాయని అన్నారు. సమావేశానికి ప్రముఖ రచయిత కె.సత్తిరాజు అధ్యక్షత వహించారు. గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలాటం బృందానికి వస్త్రాల పంపిణీ

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని అడ్డం గ్రామంలో కోలాట బృందం మహిళలు, యువకులకు రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి, సోమవారం గ్రామ సర్పంచ్ గొంతిని శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో చీరలు, పంచెలు, కండువాలు అందజేశారు. వాటిని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణ మూర్తి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గొంతిని శ్రీనివాసరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెర్రీ పోతుల నూకునాయుడు, వేణు, దుద్దెటి శ్రీను, పాల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ రాజు, గుంటూరు మనిరాజు, నర సింహమూర్తిరాజు, నారాయణ రాజు, నానాజీ, రమణ, గ్రామ ప్రజలు, పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

తహశీల్దారుగా కనకారావు బాధ్యతలు

విశాలాంధ్ర - పరవాడ: మండల తహశీల్దారుగా వి.కనకారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మాకవరపాలెం తహశీల్దారుగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన వానపల్లి ప్రకాశరావు మునగపాక మండలం బదిలీపై వెళ్లారు. నూతన బాధ్యతలు చేపట్టిన తహశీల్దారుకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన వీఆర్‌ఓలు, వీఆర్ఏలు తదితర రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది అందరూ తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే డిప్యూటీ తహశీల్దారుగా శాంతి భూషన్ బాధ్యతలు చేపట్టారు. ఆర్ఐ, సర్వేయర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో ఆనందపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎగువ యాతపేటలో కొలుసు కృష్ణమ్మ ఇల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. కుటుంబం మొత్తం నిరాశ్రయులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ చందక లక్ష్మీ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించి 2000 రూపాయలు, ఒక బియ్యం ప్యాకెట్టు, నిత్యావసర సరుకులు అందించారు. బాధితులకు వెంటనే ఇళ్ల మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చందక లక్ష్మి, వైసీపీ నాయకులు షిణగం పెదరామారావు, షిణగం చిన రామారావు, చందక శంకర్రావు, వీఆర్‌ఓ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న హరే కృష్ణ టెంపుల్స్ చీఫ్

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారిని శ్రీమాన్ మధుపండిట్ దశజీ చైర్మన్ వర్ధవన్ చంద్రోదయ మందిర్ చీఫ్ హరే కృష్ణ టెంపుల్స్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి నరసింహరాజు, పర్యవేక్షకులు పాలూరి నరశింగరావు ఘన స్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్థంభం ఆలింగనం చేసుకుని స్వామి వారికి పూజలు నిర్వహించారు.

ఆక్రమణలు తొలగింపు

విశాలాంధ్ర -యలమంచిలి: పట్టణ మున్సిపాలిటీ వార్డు నెంబర్ 6లో రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను పట్టణ ప్రణాళిక విభాగ ఆధ్వర్యంలో తొలగించారు. తులసీనగర్ వీధిని ఆనుకుని అటు జగనన్న కాలనీతో పాటుగా నూతన ఆసుపత్రిని కూడా నిర్మిస్తున్నారు. రానున్న కాలంలో వాహన రాకపోకలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని, గత కొన్నేళ్లుగా అదే రోడ్డు పక్కన ఉన్న తాత్కాలిక బడ్డీలను శుక్రవారం జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ శ్రీలక్ష్మితో పాటుగా పట్టణ ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

పీఎస్‌లో సిబ్బందికి వీడ్కోలు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 13 మంది పోలీస్ సిబ్బంది కౌన్సిలింగ్ విధానం ద్వారా బదిలీలపై ఆయా ప్రాంతాలకు వెళుతున్నట్లు సీఐ సన్యాసి నాయుడు తెలియజేశారు. ఇంతమంది ఒకేసారి స్టేషన్ పరిధి నుండి బదిలీ అయిన సిబ్బందికి ఘనంగా వీడ్కోలు తెలియజేశారు. ఆయా పరిధిలో బదిలీ అయి ప్రతి చోట ఉత్తమ సేవలు అందించి మంచి పేరు తెచ్చుకొని ఉన్నతి స్థాయికి వెళ్లాలని ఆయన కోరారు. కౌన్సిలింగ్ విధానం ద్వారా మీరు కోరుకునే చోటకే మీరు బదిలీ అవడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన ఆయా హోదాలో ఉన్న పోలీసులు పాల్గొన్నారు.

స్పందన ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: స్పందనలో అందిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించాల్సిందేనని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అందిన ప్రతి ఫిర్యాదుకు సంబంధించి విచారణా ధికారిని నియమించాలని విచారణ అనంతరం చేపట్టిన పరిష్కార వివరాలను ఫిర్యాదుదారుకు తెలియజేయాలని సూచించారు. శుక్రవారం స్పందనకు 139 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలక్టర్ జె.శివశ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ వి. అభిషేక్, అసిస్టెంట్ కలక్టర్ ఆశుతోష్ శ్రివాస్తవ, డి.ఆర్.ఓ. పి అంబేద్కర్, ప్రత్యేక ఉప కలక్టర్ శర్మ, ఎపిఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా వెచ్చంగి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా వెచ్చంగి సాధూరామ్‌ను అధిష్టానం నియమించిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి.నీలకంఠం తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆదివాసి చైర్ పర్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరకు వ్యాలీ నియోజకవర్గ ఇన్చార్జి పాచిపెంట శాంతకుమారి ముంచింగిపుట్టు మండలం కరిముఖి పుట్ పంచాయతీ నందిమెట్ట గ్రామానికి చెందిన వెచ్చంగి సాధూరామ్‌కు నియామక ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అనంతరం సాధూరామ్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి, పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచనలు, సలహాలు పాటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

పాత్రికేయునికి పైలా ఆర్థికసాయం

విశాలాంధ్ర - కె.కోటపాడు: కె.కోటపాడు మండలంలో సీనియర్ విలేకరిగా పనిచేసిన నేమాల సతీష్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న మాడుగుల నియోజకవర్గం టీడీపీ నాయకులు పైలా ప్రసాద్‌రావు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి 10000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మేయర్ హరివెంకట కుమారి

విశాలాంధ్ర - కొమ్మాది: ప్రతీ ఇంటిని వ్యవసాయ క్షేత్రంగా మార్చుకోవడం ద్వారా రాబోయే తరాలకు ఆరోగ్యాన్ని అందిచే వాళ్ళు అవుతారని విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. శుక్రవారం జీవీఎంసీ జోన్ -2, 7వ వార్డులో ఐ టైలర్స్ కాలనీలో గల జానుస్ నేచర్ మిద్దె తోటను ఆమె సందర్శించారు. 60 గజాల మిద్దె మీద అనేక రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, ఔషధ మొక్కలను పెంచుతున్న ఝాన్సీని మేయర్ హరివెంకట కుమారి అభినందించారు. జోన్ -2 కమిషనర్ కనక మహాలక్ష్మి మాట్లాడుతూ తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను పెంచుతూ వాటి ద్వారా పండ్లు, కూరగాయలను పండించడం శుభపరిణామమని అన్నారు. ప్రతీ ఒక్కరూ బంగారు ఝాన్సీని ఆదర్శంగా తీసుకొని మిద్దె తోటలను సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం మేయర్ దంపతులు గొలగాని హరివెంకట కుమారి, శ్రీనివాసరావులను దుశ్శాలువాతో సత్కరించి మిద్దె తోటలో కాసిన పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బంగారు ప్రకాష్, వట్టికుల నాగమ్మ, పసుపులేటి గోపి, నూకవరపు బాబ్జి, బెల్లాన పాపారావు, బట్టాన రాజు, ఇజ్జాడ సత్యన్నారాయణ, దత్తి వాసు, ఆర్పీలు తెంటు మాధవి, లావణ్య, రూప తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరా తొలగింపు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని వెంకటనగరం పంచాయతీ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా సాగు చేస్తున్న రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపి వేసినట్లు గ్రామ సర్పంచ్ వంకా వెంకట రమణ తెలిపారు. గ్రామ సమీపంలో సుమారు 15ఏళ్లుగా ఎటువంటి అనుమతులు లేకుండా సుమారు 14 ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని తెలిపారు. సాగు చేస్తున్న రొయ్యల చెరువుల కారణంగా పంట భూములు, భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గ్రామంలో చాలా మంది ప్రజలు, పశువులు రోగాల బారిన పడ్డారని తెలిపారు. గ్రామానికి సరఫరా అయ్యే తాగునీరు పైపులైను కూడా ధ్వంసం అయినట్లు తెలిపారు. సుమారు రూ.3 లక్షల ప్రభుత్వ నిధులతో కొత్త పైపులైను వేసినట్లు తెలిపారు. రొయ్యల చెరువులకు ఎటువంటి అనుమతులు లేవని, వీటిని తొలగించాలని సంబంధిత మత్స్యకార, రెవెన్యూ, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మత్స్యకార అధికారులు స్పందించి ఆక్వా అథారిటీని నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని, 10రోజులు సమయం ఇస్తూ రొయ్యల చెరువుల యజమానులకు నోటీసులు జారీ చేశారని తెలిపారు. వై.సూర్య నారాయణకు చెందిన సర్వే నెంబరు 284/1, 281, 29/1ఎ/2, 290/1ఎ/1/1/బి, 290/1 సర్వే నెంబరులలో ఉన్న రొయ్యల చెరువులు సాగు చేస్తున్న యజమానులకు నోటీసులు జారీ చేసి, విద్యుత్ సరఫరా నిలిపి వేసినట్లు సర్పంచ్ వంకా వెంకటరమణ తెలిపారు. ఈ విషయమై విద్యుత్ రూరల్ ఏఈ పరదేశిని వివరణ కోరగా మత్స్యశాఖ, తహశీల్దార్ ఆదేశాల మేరకు అనుమతులు లేని రొయ్యల చెరువులకు ఉన్న 3 విద్యుత్ కనెక్షన్లు తొలగించినట్లు తెలిపారు.

194 మంది జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రతిపాదనలకు ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జిల్లాలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహిస్తున్న 194 మంది జర్నలి స్టులకు సంబంధించి అక్రిడిటేషన్ ప్రతిపాద నలను ఆమోదించడం జరిగిందని జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డా.ఎ.మల్లిఖార్జున తెలిపారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం ఉదయం కలెక్టర్ మరియు ఛైర్మన్ డి ఎం ఎ సి, అధ్యక్షతన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ రెండవ సమావేశం ఏర్పాటు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహించుచున్న ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులను మొదటి విడతగా 301 మంజూరు చేయడం జరిగిందని, ఈరోజు జరిగిన సమావేశంలో రెండవ విడతగా 194 మొత్తం 495 కార్డులు ఇప్పటి వరకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న, ఇప్పటి వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేయని జర్నలిస్టులు ప్రభుత్వ ఉత్తర్వులు 38, తేది 30-3-2023 ననుసరించి ధరఖాస్తు చేసుకొని సదరు దరఖాస్తులను జిల్లా పౌర సంబంధాల కార్యాలయానికి అందజేయాలని అన్నారు. కేజీహెచ్ డౌన్లో గల డాల్ఫిన్ దయాగ్నాస్టిక్స్ సర్వీసెస్ సెంటరు నందు ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుండి 2023 సంవత్సరంలో అక్రిడిటేషన్ పొందిన అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు (56 పరీక్షలు) నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇన్చార్జి మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభి స్తారని తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకునే అక్రిడేటెడ్ జర్నలిస్టులు కె.జి.హెచ్ వద్ద గల డాల్ఫిన్ డయాగ్నొస్టిక్స్ సర్వీసెస్ నందు 10 వ లేదీ నుండి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రోజుకి 30 మంది చొప్పున వైద్య పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. కావున అక్రిడిటెడ్ జర్నలిస్టులు తప్పక హాజరు కావాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, కన్వీనర్, మెంబరు వి.మణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారస్తులకు మార్కెట్ స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు: పాడేరులో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారస్తులకు, వీధి విక్రయిదారులకు మార్కెట్ స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరే షన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో స్థానిక ఓల్డ్ బస్టాండ్ నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాడేరు అభివృద్ధిలో భాగంగా చిరు వ్యాపారస్తులకి, వీధివిక్రయదారులకి ప్రభుత్వ ఇతర డిపార్ట్మెంట్ అధికారులతో చర్చించి అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ అమర్, ఇతర ప్రతినిధులు వరలక్ష్మి, వసంత, రంభ, మని, మచ్చమ్మ, శివ, శ్రీను, లక్ష్మణ్, పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఆర్బీకే వెల్నెస్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర - ఆనందపురం: అనందపురం మండలం గంభీరం గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రైతు భరోసా కేంద్రం వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం శాసనసభ్యులు మాట్లాడుతూ ఇప్పటి వరకు గంభీరం గ్రామపంచాయతీ మొత్తంగా 16 కోట్లు రూపాయలు ఖర్చు చేసామని తెలిపారు. అలాగే జిల్లాలో మొదటి సచివాలయం ప్రారంభించామని ఆ ఘనత గంభీరం గ్రామపంచాయతీకి దక్కుతుందని తెలిపారు. అలాగే ఏ ప్రభుత్వం చేయలేని విధంగా వైసీపీ ప్రభుత్వం చేస్తుందని, కుల, మత బేధాలు లేకుండా సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ఏడీఏ విజయ ప్రసాద్, మండల పార్టీ అధ్య క్షులు బంక సత్యం, వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, భోట్ట ధనలక్ష్మి రామ కృష్ణ, జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట రావు, మండల ఉపాధ్యక్షులు కోరాడ ముసలి నాయుడు, ఎంపీడీఓ ఆడప లవరాజు, ఏఓ సంధ్యరత్నప్రభ, డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో గల అరకులోయ ప్రభుత్వ రెసిడెన్షియల్ ఐటిఐ, చింతపల్లి ప్రభుత్వ ఐటిఐతో పాటు లెనోరా ప్రవేట్ ఐటిఐ సీట్ల ప్రవేశం కొరకు ఈనెల 14, 15 తేదీలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అరకులోయ ప్రభుత్వ రెసిడెన్షియల్ ఐటిఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి ఐటిఐ ప్రవేశాల కొరకు కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 14న 1వ ర్యాంక్ నుండి 500 ర్యాంకు వరకు ఉదయం తొమ్మిది గంటల నుండి, 15వ తేదీన 501 ర్యాంక్ నుండి 1005 ర్యాంక్ వరకు ఉదయం 9 గంటల నుండి కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని, కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇప్పటికే మెరిట్ ర్యాంకు ఇంటికి పంపించామన్నారు. ఒకవేళ సమాచారం అందకపోతే అన్ని ఒరిజినల్ ధృవ పత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉక్కు అమ్మకాన్ని విరమించుకుంటున్నట్టు అమిత్‌షా ప్రకటించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని విరమించుకుంటున్నట్టు కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కరపత్రాలను ముద్రించి టీసీ గేటు వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయుకులు మాట్లడుతూ కేంద్ర మంత్రి అమిత్ షాకు వైజాగ్ స్టీల్ ప్రవేటుపరంపై క్యాబినెట్ నిర్ణయం విరమించుకోవాలని అన్నారు. స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటన చేయాలని కోరారు. ఆదివారం అమిత్ షా వైజాగ్ పర్యటన సందర్భంగా కూర్మన్నపాలెం జంక్షన్ దీక్షా శిబిరం వద్దకు కార్మికులు, నిర్వాసితులు విచ్చేసి ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, జె.రామకృష్ణ, దొమ్మేటి అప్పారావు, మంగా వెంకటరావు, చీకటి శ్రీనివాసరావు, పిట్టారెడ్డి, నమ్మి సింహాద్రి, జగదీష్, రాజారావు, ఈశ్వరావు, నాయుడు, సత్యారావు, రాజ, ఆనంద్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోండి

సీపీఐ మండల కార్యదర్శి సత్తిబాబు

విశాలాంధ్ర - జీకే వీధి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మండలంలోని రింతాడ పంచాయతీ కడుగుల గ్రామంలో చేపట్టనున్న మట్టి రహదారి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. పంచాయితీ వార్డు సభ్యురాలు సిందేరి వన్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. చాలామంది గిరిజనులు పని లేక వలసపోయే పరిస్థితి కలుగుతుందని, ఉపాధి హామీ పని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజువారీ 272 రూపాయలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రామూర్తి, నూకరత్నం, సాంబశివ, గొల్లోరి శ్రీరాములు, గ్రామస్తులు కొర్ర మంతు, కిల్లో నారాయణరావు, కిల్లో మొద్దునో, వంతలా కళ్యాణ్‌రావు, గొల్లోరి బుద్ధు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండల కేంద్రమైన మాడుగుల శ్రీ మోదమాంబ కాలనీలో నిర్మాణం అవుతున్న జగనన్న కాలనీ నిర్మాణ పనులను హౌసింగ్ అధికారులు శుక్రవారం పర్యవేక్షించారు. నేడు హౌసింగ్ డే సందర్భంగా వారికి ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదమాంబ కాలనీకి జగనన్న ఇళ్ల నిర్మాణాల పథకం కింద 170 ఇళ్లు మంజూరు కాగా 128 లబ్ధిదారులు మాత్రమే ఇల్లు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, మండల అభివృద్ధి అధికారి, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజక వర్గంలోని చింతూరులో అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ అధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ గ్రూపులకు ఎమ్మెల్యే ధనలక్ష్మి శుక్రవారం ట్రాక్టర్లు పంపిణీ చేశారు. నెల్లిపాక మండలం-3, చింతూరు మండలం-3, కూనవరం మండలం-1, వి.ఆర్.పురం మండలం -3 ట్రాక్టర్లు , నాలుగు విలీన మండలాలు కలిపి మొత్తం 10 ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఎంపీపీ సవళం అమల, జెడ్పీటీసీ, కూనవరం జెడ్పీటీసీ, నెల్లిపాక ఎంపీపీ, 4 మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారిగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు వ్యవసాయ అధికారిగా డి.శ్రీనివాసరావు శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత వ్యవసాయ అధికారి కే.కృష్ణ కాంత్ భీమవరం డీఏఓ కార్యాలయంనందు టెక్నికల్ ఏఓగా బదిలీపై వెళ్లనున్నారు.

మద్యం సేవించి నడిపితే రూ.10 వేలు ఫైన్

విశాలాంధ్ర - పరవాడ: మద్యం సేవించి నడిపితే రూ.10 వేలు జరిమానా లేదా వారం రోజులు జైలు విధించనున్నట్లు పరవాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పెడిరెడ్ల ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇక నుంచి డ్రంక్ అండ డ్రైవ్‌లో పట్టు బడితే భారీ జరిమానా విధించక తప్పదన్నారు. అనకాపల్లి కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన చేశామన్నారు. వాహన చోదకులంతా అన్ని పత్రాలను వెంట పెట్టుకునే వాహనాలు నడపాలని సీఐ పేర్కొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కోలుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: ద్విచక్ర వాహన (స్కూటీ) ప్రమాదంలో గాయపడి కాలు విరిగి శస్త్ర చికిత్సతోపాటు మెరుగైన వైద్య సేవలు పొంది ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వర్తక సంఘం కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడును స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి ధారలక్ష్మి, చిందాడ జయలక్ష్మి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లిలతో కలసి ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు పండించే పంటలకు ఈ క్రాప్ తప్పనిసరి

విశాలాంధ్ర - చింతపల్లి: రైతులు పండించే వ్యవసాయ పంటలకు తప్పకుండా సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా ఈ క్రాప్ చేయించుకోవాలని ఎంపీడీఓ ఆశాజ్యోతి, అగ్రికల్చర్ ఏవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం లోతుగెడ్డ పంచాయితీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ చింతర్ల సునీల్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రైతులు తాము పండించే పంటలకు ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. అగ్రికల్చర్ ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో ప్రభుత్వం ద్వారా రైతుల నుండి పసుపు కొనుగోలుకు జూన్ 30 వరకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాబూరావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు సాగిన శ్రీరాములు, ఈవోపీఆర్డి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్‌లు, రైతులు పాల్గొన్నారు.

జెన్‌కో సీలేరు కార్యనిర్వాహక ఇంజనీర్‌గా రాజేంద్రప్రసాద్

విశాలాంధ్ర - సీలేరు: ఏపీ జెన్‌కో కార్యనిర్వాహక ఇంజనీర్ (ఓఅండ్ఎం)గా వి.రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు జెన్‌కో ఎండి కెవికె.చక్రధరబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఈఈ లక్ష్మీనారాయణను బదిలీ చేయగా, ఆయన స్థానంలో కృష్ణపట్నం దామోదర సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌లో పని చేస్తున్న రాజేంద్రప్రసాద్ ఇక్కడ నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం విధుల్లో చేరనున్నారు.

ప్రతీ ఇంటా సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే గణేష్

విశాలాంధ్ర - మాకవరపాలెం: ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రతీ ఇంటా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మాకవరపాలెం మండలం దుంగల వానిపాలెం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకు పర్యటిస్తూ నాలుగేళ్ల పాలనలో కలిగిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ప్రజలు నుంచి వినతులు స్వీకరించి వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షులు రుత్తల వాసు, వైస్ ఎంపిపి రాజారావు, స్థానిక నాయుకులు గోర్లి వరలక్ష్మి, సర్పంచ్‌లు, ముఖ్య నాయుకులు, వివిధ శాఖల అధికారులు పాలొన్నారు.

అంగన్వాడీ పోస్టు భర్తీ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఇక్కడి అంగన్వాడీ సెంటర్-2లో నిబంధనలకు విరుద్ధంగా నియమించిన అంగన్వాడీ కార్యకర్తను తొలగించాలని మాకవరపాలెం సర్పంచ్, టీడీపీ మండల మహిళా శాఖ అధ్యక్షురాలు అల్లంపల్లి శిరీష జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాకవరపాలెం సెంటర్-2లో పని చేసే ఎస్సీ రిజర్వుకు చెందిన కార్యకర్త పదవీ విరమణ చేశారన్నారు. ఈ పోస్టులో ప్రస్తుతం ఇక్కడి అంగన్వాడీ సెంటర్-4లో ఆయాగా పని చేస్తున్న బిసి కులానికి చెందిన మహిళకు అర్హతలు ఉన్నాయంటూ పదోన్నతి కల్పించి నియమించారన్నారు. ఈ పోస్టు ఎస్సీ రిజర్వు కావడంతో బిసి కులానికి చెందిన మహిళను తొలగించి, ఎస్సీ కులానికి చెందిన మహిళను ఎంపిక చేయాల్సిందిగా కోరారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

ఆకట్టుకుంటున్న అండర్ వాటర్ టన్నెల్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ బీచ్ రోడ్డులో నిర్వహిస్తున్న అండర్ వాటర్ టన్నెల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. టన్నెల్లో ఏర్పాటు చేసిన వివిధ రకాల చేపలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. విదేశాల్లో మాత్రమే కనిపించే రేపామా హెల్ ఫిష్, హనీమూన్ ఫిష్, క్యాట్ ఫిష్, సిల్వర్ ఫిష్, గోల్డెన్ ఫిష్, ఆస్కార్ ఫిష్, కర్పీ ఫ్రక్ పేరన్న, జంతి, ఎస్కే గోల్డ్ ఫిష్, చికెల్డ్ ఫిష్, జీబ్రా ఫిష్, టీన్ ఫోల్ ఫిష్ , జయంతి గౌరమీ ఫిష్, అరోనా ఫిష్, మోలి ఫిష్ ప్రత్యక్షంగా కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. చిన్నారులకు ఈ అండర్ వాటర్ టన్నెల్ ప్రదర్శన ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. వేసవి సెలవులను నేపథ్యంలో అత్యధిక సందర్శకులు ఈ అండర్ వాటర్ టన్నెల్ ప్రదర్శనకు డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా వారాంతపు రోజులైనా శని, ఆదివారాల్లో మరింత తాకిడి అధికంగా ఉంది. సమ్మర్ స్పెషల్ స్వదేశీ చేపలతో పాటు విదేశీ చేపలు కూడా ప్రత్యేక ఆకర్షణగా అందర్నీ ఆకట్టుకుంటున్నాయి.

అమిత్ షా పర్యటనను అడ్డుకోవాలి

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసి ఏపీ ప్రజలకు తీవ్ర అన్యాయం చేయడానికి పూనుకుంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశాఖ పర్యటనను అడ్డుకోవాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీఉల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పెందుర్తిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో 37 మంది బలిదానాలతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుకు కట్టబెట్టడం దారుణమని మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ అహర్నిశలు పోరాడుతుందని స్పష్టం చేసారు. ఈ నెల 11న అమిత్ షా విశాఖ వర్యటన అడ్డుకోవాలన్నారు.

సమ్మె గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - కొమ్మాది: ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయడం తో పాటు ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్లాప్ వెహికల్ డ్రైవర్లకు 18,500 రూపాయలు ఇవ్వాలని మున్సిపల్ యూనియన్ జోన్ 2 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ శేషు బాబు, ఎస్.రామప్పుడు డిమాండ్ చేశారు. ఈ నెల 19 నుండి జరగనున్న నిరవధిక సమ్మె గోడ పత్రికను స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మికులు శుక్రవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. వాటర్ సప్లై, యు జీడీ, మలేరియా కార్మికులను స్కిల్స్ కార్మికులుగా గుర్తించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు కె.నాగరాజు, బి.నర్సింగరావు, కె.సురేష్, కె.శ్రీను, పి.రామారావు, బి.ఆదిలక్ష్మి, సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కడశిల్ప వంతెనకు రక్షణ కరువు

విశాలాంధ్ర - చింతపల్లి: మండలంలో ప్రమాదాలకు నిలయంగా మారిన కడశిల్ప వంతెనకు రక్షణ కరువైంది. నాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ వంతెన మీదుగా ప్రయాణిస్తున్న బొలెరో వాహనం బోల్తా పడి బెన్నవరం సర్పంచ్ సలభం గణపతి నాయుడు సహా పదిమంది మరణించిన విషయం పాఠకులకు తెలిసిందే. నాడు మంత్రిగా ఉన్న పసుపులేటి బాలరాజు మన్య ప్రాంతంలోని వంతెనల వద్ద రక్షణ గోడలు (సైడ్ వాల్స్) నిర్మించాలని అధికారులను ఆదేశించినప్పటికీ నేటికీ ఆ వంతెనల వద్ద రక్షణ గోడలు నిర్మించలేని పరిస్థితి. దీనికి తోడు వాహనాల రాకపోకలతో ఆ ప్రాంతంలో అంతంతమాత్రంగా ఉన్న రహదారులు అధ్వాన్న స్థితికి చేరాయి. అన్నవరం, లోతుగెడ్డ నుండి బెన్నవరం మీదుగా అటు కొత్తపాలెం ఇటు లోతుగెడ్డ జంక్షన్ మీదుగా మైదాన ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఉండే ఈ రహదారి అధ్వానంగా మారడంతో వాహన చోదకులే గాక, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణి కులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ఈ మార్గంలో రహదారి మెరుగుకు, అదే క్రమంలో వంతెనల వద్ద రక్షణ గోడల నిర్మాణానికి సంబంధిత శాఖ ఉన్నతాధికారులు కృషి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కొండపోడు భూముల సర్వే చేపట్టాలి

విశాలాంధ్ర - దేవీపట్నం: గిరిజనుల సాగులో ఉన్న కొండపోడు భూములకు సర్వే చేపట్టి పట్టాలు ఇప్పించాలని దేవారం, శరభవరం ఎంపీటీసీ సభ్యుడు తుర్రం జగదీశ్ దొర కోరారు. శుక్రవారం ఎంపిపి కుంజం మురళీ అధ్యక్షతన దేవీపట్నం మండల సర్వ సభ్య సమావేశం ఇందుకూరుపేట వెలుగు కార్యాలయంలో జరిగింది. తొలుత వివిధ శాఖల పురోగతిపై ఆయా శాఖల అధికారులు నివేదికలు అందించగా శాఖల వారీగా వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం మండల యూత్ కన్వీనర్ శరభవరం, దేవారం ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర మాట్లాడుతూ కొండ పోడు పట్టాలు ఇచ్చిన ఆదివాసిలందరికీ సర్వే చేసి భూములు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాము గండి గ్రామ పంచాయితీ సర్పంచ్ కోసు బుచ్చన్న దొర, డీ.ఎన్.పాలెం గ్రామ పంచాయితీ సర్పంచ్ మిర్తి వాడపోసి రత్న రెడ్డి, దేవరం గ్రామ సర్పంచ్ తుర్రం రమా దేవి, చిన్న రమణయ్య పేట ఎంపీటీసీ సోదే లక్ష్మి కుమారి, వి.రామన్న పాలెం ఎంపీటీసీ సోముల శిరీష, శరభవరం గ్రామ పంచాయితీ సర్పంచ్ కొమరం లక్ష్మి దేవి, కొండ మొదలు గ్రామ పంచాయితీ సర్పంచ్ వేట్ల విజయ, ఎంపిడిఓ డి.ఎన్.రత్న కుమారి పాల్గొన్నారు.

పాఠశాలలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన కోడిగుడ్లు, కోడి మాంసం, కూరగాయలు, పాలు, అరటి పండ్లు సరఫరా చేయుటకు టెండర్ల ద్వారా ఖరారు చేయడం జరిగిందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇ.జాన్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ హాలులో రంప చోడవరం, చింతూరు డివిజన్లో 11 మండలాలలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల ఆశ్రమం పాఠశాలలో సరుకులను తక్కువ ధరలకు టెండర్లు వేసిన టెండర్లదారులను ఖరారు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ఈ టెండర్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే వారి ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం జూన్. జూలై ఆగస్టు మూడు నెలలకు ఈ టెండర్లు ఖరారు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. గురుకులాలకు టెండర్‌దారులే డోర్ డెలివరీ చేయాలని అలా చేయని యెడల టెండర్లు రద్దు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓలు రామతులసి, సుజాత, శాంతి, జల్లి చెంబుడు, ప్రసాద్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఆలీషా, ప్రసోనా, సూపరింటెండెంట్ రమణ, సీనియర్ అసిస్టెంట్ చక్రధర్‌రావు పాల్గొన్నారు.

షిప్‌యార్డు లేఅవుట్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మైత్రి నగర్‌లో ఉన్న షిప్‌యార్డు లే అవుట్‌లోని ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. భూ కబ్జాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేయించాలంటూ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోరారు. భూ వివాదంపై ఆక్రమణదారులు తమదే పైచేయి అంటున్న అధికారులెందుకు చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 164/1లో వుడా అప్రూవల్ ద్వారా ఇక్కడ అనేక మంది ప్లాట్లు కొనుగోలు చేసుకున్నామని, 2012 వరకు బానే ఉన్నా ఆ తర్వాతే కబ్జారాయుళ్లు తెరపైకి వచ్చారని ఆరోపించారు. అందుకు వుడా ఎల్పీ నంబర్ 30/94, 1/2004 పేరిట పత్రాలు కూడా చూపిస్తున్నారు. అయితే తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి డీవీ మహేష్ అనే వ్యక్తి స్థలాల్ని కాజేయాలని చూస్తున్నారని, తాజాగా శివరామ ప్రసాద్ అనే మరో వ్యక్తి వచ్చి తనదిక్కడ మూడెకరాలుందంటూ చెబుతున్నారని తెలిపారు. దుంబారి ప్రభాకర్ అలియాస్ సీలు, సేనాపతి సోమశేఖర్ నాయుడు అనే వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిలో వివాదం సృష్టించాడని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా రెండ్రోజుల క్రితం రాత్రి వేళ అక్కడ ఉంచిన జనరేటర్‌ను మహేష్, ఆయన వర్గీయులు ధ్వంసం చేశారని, ఈ మేరకు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోక పోవడం అన్యాయమన్నారు. న్యాయస్థానాల్లో ఓడిపోయినా రౌడీ షీటర్లను తీసుకువచ్చి స్థలాన్ని కబ్జా చేసేందుకు మహేష్, అనుచరులు ప్రయత్నించారని కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరరావు తెలిపారు. అల్లరిమూకల్ని తీసుకువచ్చి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని వారంతా కోరారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీలో కరెంట్ కష్టాలు

విశాలాంధ్ర - దేవీపట్నం: పగలు భానుడి భగభగలు రాత్రుళ్ళు కరెంట్ కోతలతో జనం విలవిలలాడుతున్నారు. కృష్ణునిపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీ వాసుల నిత్యం ఎదుర్కొంటున్న సమస్య. పోలవరం పుణ్యమా అంటూ గోదావరి ఒడ్డున పాపికొండల అభయారణ్యంలో చల్లని గాలులు పీల్చుకుంటూ సుఖంగా కాలం వెళ్ళబుచ్చుతున్న జనాన్ని పునరావాసం పేరుతో గోకవరం శివారు కృష్ణుని పాలెం వునరావాస కాలనీకి తీసుకొచ్చి వడేసిన అధికారులు ఇక్కడ ఎటువంటి హక్కులు, అధికారాలు లేకుండా జనాలను కష్టాలతో కాపురం చేయమని తీసుకొచ్చి పడేసారు. ఇక్కడ ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారింది. సుమారు పన్నెండు వందల కుటుంబాలు ఉన్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో విద్యుత్ సరఫరాలో సమస్య ఉత్పన్నం అయితే చెప్పుకొనే దిక్కు లేకుండా పోయింది. ఇక్కడ విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో ఏ సమస్య ఉత్పన్నం అయినా మాకు సంబంధం లేదు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని టిడిపి నాయకులు తైలం గంగాధర్ కోరుతున్నారు.

ఆర్బీకేల సేవలను రైతులు వినియోగించుకోవాలి



విశాలాంధ్ర - పరవాడ: ఆర్బీకేల ద్వారానే రైతులు పూర్తిస్థాయిలో సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే అనేక రాయితీ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. ఆ కేంద్రాల ద్వారానే నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి సిహెచ్ చంద్రావతి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాయితీపై వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. బిపిటి-5204(సాంబ మసూరి) రకం 80 క్వింటాళ్లు, ఆర్.జి.ఎల్-2537 (శ్రీకాకుళం సన్నాలు) రకం 80 క్వింటాళు, ఎం.టి.యు-1224(మార్టేరు సాంబ) రకం 5 క్వింటాళ్లు, ఆర్.ఎన్.ఆర్-15048 (తెలంగాణ సోన)రకం 2 క్వింటాళ్లు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ చేయించుకున్న పలువురు రైతులకు ఎంపీపీ చేతుల మీదుగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వ్యవసాయ విస్తరణాధికారులు పి. సంజీవరావు, ఎం ఎన్ మూర్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు గౌతమి, అనిత, అనూష, జ్యోతి, జాస్మిన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

22తో ముగియనున్న ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ తొమ్మిది శాతం ఆఫర్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ బాండ్స్ మీద 9 శాతం ఉత్పత్తిని ఆఫర్ చేస్తున్నట్లు ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ హైదరాబాద్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ కపిష్ జైన్ తెలిపారు. ఈ ఇష్యూ జూన్ 22, 2023న ముగుస్తుందన్నారు. సురక్షిత బాండ్ల పబ్లిక్ ఇష్యూని ప్రారంభించి రూ .1,500 కోట్లు వ్యాపార వృద్ధి, మూలధన వృద్ధి ప్రయోజనం కోసం బాండ్‌లు గరిష్టంగా 9 శాతం దిగుబడి, అధిక స్థాయి భద్రతను అందిస్తాయన్నారు. బాండ్ ఇష్యూ అనేది జూన్ 22 లేదా దాని కన్నా ముందు డిమాండ్ బట్టి మూసివేయబడతాయని తెలిపారు. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సురక్షిత రీడీమబుల్ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్‌లను (ఎన్సీడీలు) జారీ చేస్తుందన్నారు. ఇది రూ.300 కోట్లకు, గ్రీన్-షూ ఎంపికతో రూ.1200 కోట్ల వరకు (మొత్తం రూ. 1,500 కోట్లకు) ఓవర్-సబ్‌స్క్రిప్షన్‌ను కలిగి ఉంటుందని పేర్కొన్నారు.

మండల పరిషత్ ఏఓగా రమణరాజు

విశాలాంధ్ర - యస్.రాయవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా దాట్ల వెంకటరమణ రాజు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇదే స్థానంలో పనిచేసిన వసంతకు ఎంపీడీఓ పదోన్నతి రావడంతో పెందుర్తి మండల పరిషత్ ఎంపీడీఓగా నియమించారు. దీంతో యలమంచిలి డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రమణ రాజు పదోన్నతిపై ఏఓగా వచ్చారు.

గొలుగొండ ఐటీడీపీ ఉపాధ్యక్షుడుగా శేఖర్

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం ఐటీడీపీ ఉపాధ్యక్షుడిగా మేజర్ పంచాయితీ అయినాపురం గ్రామానికి చెందిన ఉత్తమ శేఖర్‌ని నియమించడం జరిగింది. సోషల్ మీడియాలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను విస్తృతంగా ప్రచారం చేయడం, గ్రామంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో తెలుగుదేశం పార్టీ శేఖరును గుర్తించి ఈ పదవి ఇవ్వడం జరిగింది. ఐటిడిపి ఉపాధ్యక్షుడు నియామకం పట్ల గ్రామ టిడిపి యువత, సీనియర్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వలంటీర్లకు వందనంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ వాలంటీర్లు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి సేవా రత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన వాలంటీర్లకు శాలువా కప్పి, మెడల్ బహుకరించి, సర్టిఫికెట్లు అందించి సన్మానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు జడ్పీటీసీ చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ సుధాకర్(చిన్ని), చింతూరు సర్పంచ్ కారం కన్నారావు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

విశాలాంధ్ర - బీడికాడ: వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని వాటిని రైతులు వినియోగించుకోవాలని ఎంపీపీ కూరచా జయమ్మ అన్నారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ ఏఓ ఎ.కృష్ణవేణి ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందించిన వరి విత్తనాలను పంపిణీ చేశారు. జైతవరం గ్రామంలో వైకాపా మండల సచివాలయ కన్వీనర్ ఈర్ల చైతన్య ఆధ్వర్యంలో వరి విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షులు యర్ర అప్పారావు, కోదూరు నారాయణమూర్తి, కోదూరు గోవిందరావు, సిబ్బంది సూరెడ్డి చిన్నమ్మలు, సిహెచ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల బాలుడు అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని ఎస్.ఆర్.పురం గ్రామంలో ఐదేళ్ల బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పల్లా తేజ అనే బాలుడు గురువారం తప్పిపోయినట్లుగా పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసారు. అయితే శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని ఒక షెడ్డు వద్ద ఆ బాలుడు విగతజీవిగా కనపించాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కన్నీరు, మున్నీరుగా విలపించారు. అభం, శుభం తెలియని తన కుమారుడిని అన్యాయంగా చంపేసారంటూ తల్లి గగ్గోలు పెడుతోంది. పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులను పట్టుకుంటామని సిఐ గొలగాని అప్పారావు తెలియచేసారు.

మోతుగూడెం అటవీ రేంజ్‌లో పెద్దపులి సంచారం

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం లక్కవరం రేంజ్‌లో పెద్దపులి సంచారం చేస్తున్నట్లు కలకలం రేపుతుంది. పెద్దపులి సంచారాన్ని అటవీ శాఖ అధికారులు గుర్తించారు. సుకుమామిడి గ్రామంలోని పంట పొలాల దగ్గర పులి జాడలు శుక్రవారం కనుగొన్నారు. మోతుగూడెం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే రైతుకు చెందిన దున్నపోతుని పులి చంపుకొని తిన్నట్లు

ఆనవాళ్లు ఉండటంతో అటవీ శాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. 192 కంపార్ట్మెంట్ సుకుమామిడి పంట పొలాల్లో పెద్దపులి సంచరించినట్లు అధికారులు గుర్తించారు. అలర్ట్ అయినా చింతూరు డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్ పుష్ప సౌజన్య తన సిబ్బందితో దున్నపోతుని పెద్దపులి చంపి తిన్నట్లు గుర్తించారు. పంజా కొలతలు తీసుకొని అడవిలో నిఘా కెమెరాలను అమర్చామని అప్రమత్తంగా ఉండాలని ఆమె ప్రజలను హెచ్చరించారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

ఆర్కిటిక్‌లో జీవ వనరులు మత్స్య పరిశ్రమ అభివృద్ధిపై చర్చ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: 2021-2023 సంవత్సరానికి ఆర్కిటిక్ కౌన్సిల్లో రష్యా అధ్యక్షునిగా ఉన్న సమయంలో నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికలో భాగంగా మే 11-12 తేదీల్లో ఆర్కిటిక్లో బయోరిసోర్సెస్ అండ్ ఫిషరీస్ కాన్ఫరెన్స్ ఆర్కాంగెల్‌లో జరిగింది. ఆర్కిటిక్ లో పనిచేయడం జీవ వనరులను పరిరక్షించడం, మత్స్య పరిశ్రమ అభివృద్ధి మరియు సముద్రంలో సాంప్రదాయ చేపల వేట పద్ధతుల నియంత్రణ యొక్క వివిధ అంశాలను పాల్గొని వారు చర్చించారు. ఆర్కిటిక్ జోన్లో ప్రధాన మౌలిక సదుపాయాలు, పెట్టుబడి ప్రాజెక్టులను అమలు చేసేటప్పుడు, సముద్ర వనరుల బాధ్యతాయుతమైన, సుస్థిర నిర్వహణ సూత్రాలకు కట్టుబడి ఉండటం చాలా ముఖ్యం అని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ రాయబారి నికోలాయ్ కోర్చునోవ్ అన్నారు. సాంప్రదాయక ప్రధాన ఆర్థిక కార్యకలాపాలలో నిమగ్నమైనందున, ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు మరియు అన్నింటికీ మించి స్థానికులకు చేపల పెంపకం చాలా ముఖ్యమైనది. జీవ వనరుల పరిరక్షణ, నిర్వహణతో పాటు ఆర్కిటిక్ పర్యావరణ వ్యవస్థను పర్యవేక్షించడం ప్రధాన లక్ష్యం. ఆర్కిటిక్ అనేక రకాల సవాళ్లను ఎదుర్కొంటోంది, వీటిలో ఒకటి వాతావరణం మరియు పర్యావరణ ఎజెండాకు సంబంధించినది.

ఈ ప్రాంతంలో సహజ ప్రక్రియలో అనియంత్రిత మానవ జోక్యం ఆర్కిటిక్ ప్రాంతంలోని మొత్తం పర్యావరణ వ్యవస్థపై చాలా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. సదస్సులో ప్రధాన ఘట్టాలు 'ఆక్వాటిక్ బయోలాజికల్ రిసోర్సెస్'. 'ఫిషరీస్ అండ్ స్టాక్ కన్జర్వేషన్ ఇన్ ది ఆర్కిటిక్' అనే అంశంపై ప్లీనరీ సెషన్ జరిగింది. ఉత్తర అక్షాంశాల్లో మత్స్య పరిశ్రమ ప్రస్తుత స్థితి, వాతావరణ మార్పుల కారణంగా మత్స్య రంగంలో సృష్టించిన కొత్త అవకాశాలు, శాస్త్రీయ డేటా ఆధారంగా ఈ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడంపై చర్చించారు.

రాబోయే ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యం

విశాలాంధ్ర - హుకుంపేట: 2024లో జరగనున్న ఎన్నికలకు వైసీపీ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డిని జిల్లా వాణిజ్యా విభాగం అధ్యక్షుడు ఒంటుబు సామ్యేల్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి పార్టీ కార్యలయంలో రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి అధ్యాక్షన వాణిజ్య విభాగాల రాష్ట్ర అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జీలు, జిల్లా అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సామ్యూల్ పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం విజసాయిరెడ్డిని మర్యాద పూర్వకంగా ఆయన కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతం సమస్యలను విజయసాయిరెడ్డికి వివరించారు. గిరిజన ప్రాంతంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ప్రభుత్వం నేరవేర్చిందని, అంతే కాకుండా గిరిజనులకు సంక్షేమ పథకాలు అందించటంతో పాటు ఇళ్ళ పట్టాలు, పేద ప్రజలకు కొండపోడు పట్టాలు పంపిణీ చేసిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందని, గిరిజను లంత ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికలకు మళ్లీ సిఎం జగన్మోహన్ రెడ్డిని గెలిపించు టకు గిరిజనులు సిద్దంగా ఉన్నారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న ప్రధాన పార్టీ నేతలతో సమేష్టిగా పని చేస్తు రానున్న ఎన్నికలకు వైఎస్ఆర్ సీపీ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ఆయన అన్నారు.

హ్యాండ్ బాల్ లీగ్ పోటీల్లో తెలుగు టాలన్స్ విజయం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్ఎల్) ఆరంభ సీజన్ అట్టహాసంగా ఆరంభమైంది. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ ఇండోర్ స్టేడియంలో గురువారం పీహెచ్ఎల్ తొలి సీజన్ మొదలైంది. లీగ్ ఆరంభ మ్యాచ్‌లో రాజస్థాన్ పాట్రియాట్స్, మహారాష్ట్ర ఐరన్‌మ్యాన్ పోటీపడ్డాయి. 28-27తో ఐరన్‌మ్యాన్‌పై పాట్రియాట్స్ ఒక్క గోల్ తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఇక తొలి రోజు రెండో మ్యాచ్‌లో తెలుగు జట్టు టాలన్స్ దుమ్మురేపింది. గార్విట్ గుజరాత్‌తో తలపడిన తెలుగు టాలన్స్ 39-32తో సాధికారిక విజయం సాధించి సీజన్లో బోణీ కొట్టింది. స్టార్ ఆటగాడు దేవెందర్ భుల్లార్, అనిల్ ఖుడియ, రఘులు మెరువగా. ప్రథమార్థం ముగిసే సరికి 19-16తో మూడు గోల్స్ ముందంజలో నిలిచింది. ఆరంభంలో కాస్త తడబడిన టాలన్స్ 5-8తో వెనుకంజలో నిలిచింది. ద్వితీయార్థంలోనూ దూకుడుగా ఆడిన తెలుగు టాలన్స్ గోల్ కీపర్ రాహుల్ అడ్డుగోడతో గుజరాత్‌ను నిలువరించింది. సెకండ్ హాఫ్ లో 21-18, 25-20, 31-24, 34-28తో తెలుగు టాలన్స్ ఆధిక్యం నిలుపుకుంది. 25-32 వద్ద ఉండగా వరుసగా మూడు గోల్స్ కొట్టిన గుజరాత్ ఊపందుకున్నప్పటికీ.. వ్యూహాత్మక విరామం తీసుకున్న టాలన్స్ మ్యాచ్‌పై పట్టు జారనివ్వలేదు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు మమతలో మెరుగైన చికిత్స

విశాలాంధ్ర - పాయకరావుపేట: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి మమత మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌లో మెరుగైన శస్త్రచికిత్స చేయనున్నట్లు హాస్పటల్ సీఈఓ వికాస్ తెలిపారు. స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ పాయకరావుపేట, తుని పరిసరాల్లో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారు సుమారు 70మంది వరకు ఉన్నట్లు తాము చేసిన సర్వేలో తేలిందన్నారు. వీరందరిని ఒక్క చోటకు చేర్చి చికిత్స నిర్వహించాలని ఆలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని సదుపాయాలు ఉన్న మమత హాస్పటల్‌లో అన్ని రకాల జబ్బులకు తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. తొండంగి మండలంకు చెందిన సాల్మాన్‌రాజు అనే యువకుడు తలసేమియా వ్యాధితో ఆసుపత్రిలో చేరగా అతనికి పరీక్షలు నిర్వహించి శరీరంలో 160గ్రాములు ఉండాల్సిన స్ప్లీన్ సుమారు 2కిలోల వరకు పెరగ్గా శస్త్రచికిత్స చేసి తొలగించామని తెలిపారు. ప్రతీ మంగళవారం గర్భిణీ స్త్రీలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవలం రూ.5వేలతో గర్భిణీలు డెలివరీ చేసుకొని ఆరోగ్యంగా ఇంటింటికి వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇన్‌ఫెక్షన్ లేకుండా ఆపరేషన్ థియేటర్, ఐసియులు అందుబాటులో ఉంచామని తెలిపారు. అర్హులైన జర్నలిస్టుల కుటుంబాలకు అవసరం మేరకు అన్ని రకాల రక్త, ఇతర పరీక్షలు నిర్వహించి, సంబంధిత నిష్ణాతులైన వైద్యులచే వైద్య సలహాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వికాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యులు సయ్యద్ నౌషాద్, రుత్తల పుష్ప రమా వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమంచున ప్రయాణం

విశాలాంధ్ర - హుకుంపేట: ప్రమాదమంచున ప్రయాణాలు ఎన్నో ప్రాణాలు బలిగొంటున్నాయి. అధికలోడుతో ప్రయాణాలు చేయడం మంచిది కాదని మొండి పట్టుతో ప్రయాణాలు చేసి ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్న సంఘటనలు ఎన్నో చూస్తున్నాము. గతంలో కంటే ఇప్పుడు ఏ మారుమూల ప్రాంతం చూసినా ప్రయాణం చేయడానికి ఆటో రిక్షాల సైతం నడుస్తున్నాయి. అయితే మారుమూల ప్రాంతాలైన సరసపాడు బాకురు, జి.బొడ్డపుట్టు ప్రాంతాల నుండి ప్రైవేట్ జీపులలో అధికలోడుతో ప్రయాణికులను ఎక్కించే ప్రయత్నమే కాక జీపు పైభాగాన ఉన్న టాప్‌పై ఆకులు కట్టలు అల్లం బస్తాలే కాక సుమారు 20 మంది వరకు ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. జీపులు ప్రయాణించడం వలన ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రైవేట్ వాహనాలు విచ్చలవిడిగా అధిక లోడుతో వాహనాలు నడుపుతున్న అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని చెప్పవచ్చు. గతంలో ఆర్టీవో అధికారులు అనకాపల్లి నుండి వచ్చి వాహనాలపై కేసులో నమోదు చేసి జరిమానా విధించేవారు. అయితే మండల కేంద్రాల్లో మఖం వేసిన ఆర్టీవో అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో వాహనదారుల దర్జాగా అధికలోడుతో జీపులు తిప్పుతూ అమాయక గిరిజనుల ప్రాణాలతో చలగాటమాడు తున్నారు. ఆటో రిక్షాల్లో నేటి ప్రయాణించాలన్న ప్రయాణికులు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. ఆర్టీవో అధికారులు కాక స్థానిక పోలీసులు సైతం వాహనాలపై ఎటువంటి చెకింగ్ లు చేయకపోవడంతో వాహన డ్రైవర్లు మద్యం సేవించి వాహనాల నడుపుతున్నారు. తరచుగా వాహనాలు ప్రమాదాలు జరిగినా సంఘటనాల్లో మద్యం సేవించి ప్రమాదాల కారణమైనవే ఎక్కువగా ఉందని తెలుస్తుంది. ప్రతి వారం మండల కేంద్రంలో శనివారం జరుగు వారం సంతలో వాహనాల పై అధిక ఆకులు లోడుతో , ప్రయాణికులను ఎక్కిస్తూ ప్రయాణాలు చేస్తున్న అధికారులు మాత్రం అంటి అంటనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి అధికలోడు వాహనాలపై దాడులు నిర్వహించి చర్యలు చేపట్టకపోతే ప్రమాదాలు సంభవించి ప్రాణాలు ఎక్కువ పోయే ప్రమాదం ఉందని భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

సర్పంచ్‌ను పరామర్శించిన నేను సైతం ఫౌండర్ శివప్రసాద్

విశాలాంధ్ర - కొయ్యూరు: అపెండిసైటిస్ నొప్పితో బాధపడుతూ వైద్య సేవలు పొందుతున్న నల్లగొండ సర్పంచ్ జంపా రాజకుమారిని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి భర్త, నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసిరెడ్డి శివప్రసాద్ పరామర్శించారు. గత కొద్దిరోజులుగా అపెండిసైటిస్ నొప్పితో తీవ్రంగా బాధపడుతూ సర్పంచ్ రాజకుమారి విశాఖలోని ఓమ్ని ఆర్ కే ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. విషయం తెలుసుకున్న అరకు ఎంపీ మాధవి ఆదేశాలతో ఆమె భర్త శివప్రసాద్ ఆసుపత్రికి వెళ్లి సర్పంచిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీస్తూ వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకునే విధంగా మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆయన కోరారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్న తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకొని తిరిగి పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పనిచేయాలని శివప్రసాద్ అభిలషించారు.

అడ్డాకులు కొనుగోలు చేయని జీసీసీ

గత ఏడాదికన్నా తగ్గిన గిట్టుబాటు ధర సిండికేట్ అయిన ప్రైవేట్ వ్యాపారులు నష్టపోతున్న గిరిజనులు

విశాలాంధ్ర - హుకుంపేట: గిరిజనులు సేకరించిన అడ్డాకులను జిసిసి కొనుగోలు చేయక గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు. మైదాన ప్రాంత వ్యాపారస్తులు ఏజెన్సీ ప్రాంతంలోని వారపు సంతల్లోకి వచ్చి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని మైదాన ప్రాంతలకు తరలి స్తున్నారు. అక్కడ అధిక లాభాలకు అమ్ముకుం టున్నారు. గతంలో గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో అడ్డాకులను కూడా జిసిసి కొనుగోలు చేసేది. గిరిజను లకు గిట్టు బాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. సుమారు గత ఐదు ఏళ్ళ సంవత్సరాల నుంచి జిసిసి కొనుగోలు చేయక పోవడంతో మైదాన ప్రాంత వ్యాపా రస్తులు కొనుగోలు చేస్తున్నారు. వారంతా సిండికేట్ అయ్యి కొను గోలు చేస్తుం డటంతో అడ్డాకులు సేకరించి న గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నా రు.వారం రోజులు కష్టించినా కుటుం బ సమేతంగా నలుగురు, ఐదుగురు ఆదివాసులు వారం రోజుల పాటు గ్రామాలకు సమీపం లోని అడవి ప్రాంతానికెళ్ళి నప్పుడు అడ్డాకులు సేకరిస్తున్న సమయంలో విషపూరిత సరఫలకాటులకు చాలామంది. బల్లిహీన సందర్భాలు ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో నైనా అడ్డాకు లను సేకరిస్తారు.ఆతర్వాత చిన్న చిన్న కట్టలు కట్టి ప్రతిరోజు ఎండలో ఆరబెడతారు.ఆతర్వాత వారపు సంతలకు విక్రయించడానికి తీసుకెళ్లే ముందు రోజు అడ్డాకులను దిండ్లిలుగా పెద్ద కట్టలను కట్టి సంతలకు తరలిస్తారు. మారుమూల గ్రామాల నుంచి వారపు సంతలకు తరలించా లంటే సుమారుగా 20 నుంచి 33 కిలో మీటర్ల దూరం ఉండటంతో 10 నుండి 15 కిలోమీటర్ల కాలిబాటన నడిచి రోడ్డు మార్గంలో మండల కేంద్రం వారపు సంతకు ప్రైవేట్ వాహనాల్లో తరలిస్తున్నారు. ఒక్కో అడ్డాకుల కట్ట (దిండి)కు రూ.80 నుంచి రూ.100ల లగేజీ చార్జీ వాహనదారు లు తీసుకుంటున్నారు. సుమారు 30 కేజీల అడ్డాకుల కట్టకు రూ.800 ధర వస్తుంది. వారం రోజుల కష్టానికి రేటు గిట్టుబాటు కాకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గిట్టుబాటు ధర ఏదీ?

గత ఏడాది 30 కేజీల అడ్డాకుల కట్టకు రూ.1200 ఆధరతో కొనుగో లు చేయగా, ఈఏడాది కేవలం రూ.800లకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రూ.400లు గిరి రైతులు నష్టపోతున్నాడు. హుకుంపేట మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో 30 కేజీల అడ్డాకు ల కట్టకు రూ.800ల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో రేటు గిట్టుబాటు కాలేదని విక్రయించిన అడ్డాకుల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు, అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన జిసిసి వీటిని కొనుగోలు చేయడ మానేయడంతో మైదాన ప్రాంతం నుంచి వస్తున్న వ్యాపారులు సిండికేట్ అయ్యి వారికి నచ్చిన ధరలో కొనుగోలు చేస్తూ.మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారు.దీంతో వారం చొప్పున రోజుల పాటు గిరిజనులు శ్రమిస్తున్నా గిట్టుబాటు ధర లభించ లేదు. ఈ విధంగా ఆదివాసుల కష్టా న్ని సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా తక్షణమే ప్రభుత్వం స్పందించి అడ్డాకులను జేసిసి ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు, పలువురు కోరుతున్నారు.

కొండల్లో వెళ్లి కష్టపడి సేకరించిన అడ్డాకులను వారపు సంతకు ముందు రోజున తీసుకొస్తున్నాం. ఇక్కడ రాత్రంతా పడి కాపులు కాసిన కొనేవారు గిట్టుబాటు ధర ఇవ్వకుండా కుంటున్నారు. దీనివల్ల పడిన కష్టానికి ఫలితం రాక రాకపోవటం లేదు.

జగదే నూకన్నా
గవ్వల మామిడి గ్రామం.
గన్నేరుపుటు పంచాయతీ

కుడేలి చిన్న లక్ష్మయ్య
కాంగు పుట్టు కాలనీ
రాపా పంచాయతీ

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర - ఎటపాక: రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను చక్కదిద్ది, మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, టీడీపీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని మాజీ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి వంతల రాజేశ్వరీ, రంపచోడవరం నియోజవర్గం పరిశీలకులు యర్రా వేణుగోపాల రాయుడు పేర్కొన్నారు. యటపాకలో "టిడిపి భవిష్యత్తుకు భరోసా" అనే సంక్షేమ పథకాల మీద విస్తృత స్థాయి సమావేశం మువ్వా శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్ల వైసీపీ పాలనలో అన్ని రంగాలు భ్రష్టు పట్టి సంక్షోభంలో కూరుకుపోయాయన్నారు. వాటిని మళ్లీ సరిదిద్ది, గాడిలో పెట్టాలంటే దేశంలోనే గొప్ప విజన్ నున్న నాయకుడిగా గుర్తింపు పొందిన చంద్రబాబు తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, యదవల్లి భాస్కర్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వల్లభనేని చందు, మండల అధ్యక్షులు పుట్టి రమేష్, వైస్ ఎంపిపి దొంతి మంగేస్వారావు, ఎంపిటిసి పాయం దేవీ, రైతు సంగం నాయకులు కానూరి బుల్లబ్బాయి, విస్సాపురం మాజీ ఎంపి టిసి నిడదవోలు సూర్య నారాయణ,వి. సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండా 123వ వర్ధంతి

విశాలాంధ్ర - జీకే వీధి :- జార్ఖండ్ టైగర్, స్వాతంత్ర సమరయోధుడు బిర్సా ముండా 123వ వర్ధంతిని చింతపల్లి ప్రభుత్వ ఐటిఐ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐటిఐ ప్రిన్సిపాల్ కె. రాజారావు అధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు అందరూ భీర్స ముండా చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజారావు మాట్లాడుతూ ఆదివాసి మొట్టమొదటి స్వాతంత్ర సమరయోధుడు భీర్స ముండా అన్నారు. ఝూర?ండ్ టైగర్ గా ఉత్తర భారతదేశం లో బ్రిటిష్ సైన్యానికి దీటుగా ఎదిరించి, విక్టోరియా రాణి పాలన వద్దు అని చెప్పి మతమార్పిడులను అడ్డుకున్న వ్యక్తి అని కొనియాడారు. బ్రిటిష్ సైన్యం తో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారన్నారు. ఆయన సేవలు మరువలేనివని, అందుకు భారత ప్రభుత్వము ఆయన జన్మదినం నాడు జాతీయ గౌరవ దినోత్సవం గా ప్రకటించిందని, అలాగే అయన పేరు ను రాంచీ విమానశ్రయం కు పెట్టిందని ఇకా అయన పేరుతో విశ్వవిద్యాలయాలు , కళాశాలలు ఉన్నాయన్నారు. కావున అటువంటి వ్యక్తి అశయాలు కొనసాగాలని, అటువంటి వ్యక్తుల అడుగుజాడలలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారులు కృష్ణ వేణి, శ్రీనివాసు, సూపర్ డెంట్ రవికిరణ్, సీనియర్ ఉపాధ్యాయులు ఈశ్వరరావు, రాముప్రసాద్, ధనుంజయ్, కోడా ఆనంద్, వెంకన్నదొర , పార్వతమ్మ, బుజంగరావు, సింహచలం, సింహాద్రి, అప్పల రెడ్డి,అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అసరాడలో అర్చకుల సమావేశం



విశాలాంధ్ర - జీకే వీధి :- మండలంలోని, రింతాడ పంచాయితీ అసరాడ గ్రామంలో విశ్వ శాంతి జ్యోతిర్మయి బాబా ధ్యాన మందిరంలో అర్చకుల సమావేశం అంగరంగ వైభవంగా జరిగిందని అర్చకుల సంఘం మండల అధ్యక్షుడు ఒంద్రంగి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన అర్చకుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల 5 న జరుపుకోవాలని, సమావేశానికి ప్రతి గ్రామంలో వున్న అర్చకులు విధిగా హాజరు కావాలన్నారు..అనంతరం ధారకొండ వద్ద గల కొంగపాకలు గ్రామం దుర్గమ్మ తల్లి గుడి అర్చకుడు తగ్గి చిన్నారావు మృతి విచారకరమని, సంఘం తరపున ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు అర్చకులు బయలు దేరుతున్నామన్నారు. జీకే విధి మండలం జర్రెల పంచాయితీ ఆడపరాయిగొంది గ్రామస్తులు ఆహ్వానం మేరకు ఆదివారం ఆ గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల అర్చక సంఘం సభ్యులు, హైందవ సైన్యం సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, సమరతా సేవా సంఘం సభ్యులు ,అర్చకులు పాల్గొనాలని కోరారు.ఈ నెల12 న గింజంగి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ సీతారామ లక్ష్మణ ,ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి అర్చకులు అందరూ పాల్గోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కిల్లో సింహాచలం, జ్యోతిర్మయి బాబా ధ్యాన మందిరం ధర్మ కర్త సలిమితి రామారావు,అర్చకులు శేఖర్,సీతమ్మ, అంజమ్మ, అరుణ్ కుమార్, చిన్నబ్బాయి, కన్నయ్యదొర, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన



విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి సుభాష్ శుక్రవారం చోడవరం లో సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక తామరచెరువు పంపు హౌస్, జగనన్న లే అవుట్ ని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించారు. అనంతరం కోమటి వీధిలో అంగన్వాడి భవనాలు పరిశీలించి పిల్లలకి అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. కొత్తూరు పెట్రోల్ బంకు వెనుక ఉన్న ప్రాథమిక పాతశాలలో నాడు నేడు పనులను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపడుతున్న నాడు నేడు పనులుత్వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తాహసీల్దార్ తిరుమల బాబు, పంచాయితీ సెక్రెటరీ నారాయణరావు, హౌసింగ్ ఏఈ అవతారం, ఎంపీపీ కాసులమ్మ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

21న ఇంటర్నేషనల్ యోగా డే

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం వాసవి క్లబ్ మరియు పతాంజలి యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా చోడవరం ఉషోదయ విద్యాసంస్థల నందు మెగా బ్లడ్ క్యాంపు మరియు అనకాపల్లి జిల్లాలో ఉన్న యోగ గురువులు అందరికీ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చోడవరం వాసవి క్లబ్ ప్రెసిడెంట్ వసుమర్తి అశోక్, క్లబ్ కార్యదర్శి భోగవిల్లి గణేష్ లు శుక్ర వారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్లడ్ క్యాంపులో పాల్గొనాలనుకున్న వారు అనకాపల్లి జిల్లాలో ఉన్న యోగ గురువులు అందరూ 9291276900, 9247355258 మొబైల్ నెంబర్లను సంప్రదించవలసిందిగా పతంజలి యోగా శిక్షణ కేంద్రం యోగ గురువు పుల్లేటి సతీష్ కోరారు.

వైఎస్సార్ బీమా అందజేత

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని చిన్న మట్టపల్లి సచివాలయం పరిధిలో చింతరెగుపల్లి గ్రామానికి చెందిన గూటాల శ్రీను వృత్తి రీత్యా వీధి వ్యాపారం చేసుకుంటూ చేపలు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. వారికి అకస్మాత్తుగా ఆరోగ్యం చెడి పోవడంతో రాజమండ్రి ప్రవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పంచాయితీ సెక్రటరీ ఆదేశాల మేరకు వెల్ఫేర్ సహాయకులు ద్వారా స్థానిక సర్పంచ్ పిట్ట రామారావు సమక్షంలో నామిని అయిన వారి భార్యకి తక్షణ సహాయంగా 10 వేల రూపాయలు అందించారు. మిగతా సొమ్ము 90 వేల రూపాయలు వారి ఖాతాలో జమవుతాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు, సచివాలయం కన్వీనర్, గృహ సారథులు, వలంటీర్లు లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా పసుపు కొనుగోలు

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రభుత్వం పసుపు రైతుల నుండి ఆంధ్ర ప్రదేశ్ మార్కుఫెడ్ నోడల్ ఏజెన్సీ గా నియమిస్తూ రైతు భరోసా కేంద్రాల ద్వారా క్వింటా 6850/-రూ చొప్పున కొనుగోలు చేస్తుందని, కావున పసుపు రైతులు రైతు భరోసా కేంద్రంలో రిజిస్టర్ చేసికొని పసుపును గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పసుపు కొనుగోలుకు నియమ నిబంధనలు సంబంధించి పంట వివరాలు ఈ పంట లో నమోదై ఉండాలని, ఆధార్ కార్డుతో స్వయంగా రైతు, రైతు భరోసా కేంద్రంలో రిజిస్టర్ చేసికోవాలని, అమ్మకం చేసిన రైతు యొక్క ఆధార్‌తో లింక్ ఐన బ్యాంక్ అకౌంట్‌లో కొనుగోలు సొమ్ము జమ కావడం జరుగుతుందని, గరిష్టంగా ఒక్క రైతు నుండి 30 క్వింటాలు కొనుగోలు చేసుకునే అవకాశం ఉందని కావున ఈ అవకాశాన్ని రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు.

అరట్లకోటలో ఉచితంగా హెచ్ఐవి, టిబి పరీక్షలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో మొబైల్ ఐసిటిసి క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్ఐవి, టిబి వ్యాధులపై అవగాహన కల్గించి, ఉచితంగా 46మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎస్సై రమేష్, సర్పంచ్ పులగపూరి అప్పలనర్స, కార్యదర్శి డి.విజయరాజు, లింక్ వర్కర్స్ స్కీమ్ సూపర్‌వైజర్ డి.రమణ, లింక్ వర్కర్ జిసిహెచ్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కొయ్యూరు : అరకు ఎంపీ గొడ్డేటి మాధవి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మండలంలో శనివారం పర్యటించనున్నట్లు ఎంపీపీ బడుగు రమేష్ తెలిపారు. మండలంలోని రాజేంద్రపాలెంలో నూతనంగా నిర్మించనున్న గిరిజన భవన్ నిర్మాణ పనులకు ఎంపీ ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎం మాకవరం సచివాలయ పరిధిలో గల లుబ్బర్తి చింతలపూడి లొద్దిపాకలు గ్రామాల్లో పర్యటించి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున మండలంలో గల వైయస్సార్సీపి నేతలు, జడ్పిటిసి, ఎంపీటీసీలు సర్పంచులు నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు అభిమానులు కార్యకర్తలు గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు విధిగా హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీపీ రమేష్ కోరారు.